ప్రజాశక్తి
గురువారం 19 జూన్ 2025

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామ్ ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. పాలిటెక్నిక్ విద్య బలోపేతంపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సాగునీరందేనా..?

- శివారు భూముల రైతుల్లో ఆందోళన
- కాలువల్లో పెద్దఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్క
- శిథిలావస్థలో షట్టర్లు
- కొత్త షట్టర్ల ఏర్పాటుకు అడ్డంకిగా మారిన అవినీతి కేసు

పంట కాలువల పరిస్థితి చూస్తే పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయాయి. మరోవైపు పూర్తి సామర్థ్యంతో నీటిని విడిచిపెడితే గట్లు బలహీనంగా ఉన్నాయి. కాలువలపై ఏర్పాటు చేసిన షట్టర్లు ఎక్కడికక్కడ లీకులు కనిపిస్తున్నాయి. గతంలో నరసన్నపేటలో వెలుగుచూసిన అవినీతి కేసు కొత్త షట్టర్ల ఏర్పాటుకు అడ్డంకిగా మారింది. క్షేత్రస్థాయిలో కీలకమైన లష్కర్లు, మ్యాన్‌మజ్దూర్ల కొరత మరోవైపు తీవ్రంగా వేధిస్తోంది. ఇది వంశధార కుడి, ఎడమ కాలువల దుస్థితి. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో ఈసారి శివారు భూములకు సాగునీరందడంపై అందరిలోనూ సందేహాలు నెలకొన్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నిర్ధేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ప్రతి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది.

కాలువల్లో పెద్దఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్క

పంట కాలువల్లో ఈ ఏడాది పూడికతీత పనులు చేపట్టకపోవడంతో శివారు భూములకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. పంట కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోయింది. గతేడాది కూడా పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఎడమ కాలువ పరిధిలోని పోలాకి, నరసన్నపేట, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని చాలా గ్రామాలకు సాగునీరందలేదు. కుడి కాలువ పరిధిలోని గార మండలంలో పంటలు ఎండిపోయిన పరిస్థితులు తలెత్తాయి.

సాగునీటికి శాపంగా షట్టర్ల కొనుగోళ్ల అవినీతి

నరసన్నపేట వంశధార ఇంజినీరింగ్ అధికారులు 2009లో కొనుగోలు చేసిన షట్టర్లలో బయటపడ్డ అవినీతి సాగు రంగానికి శాపంగా మారింది. అధిక ధరకు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై సిఐడి రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. ఇప్పటికీ ఆ కేసు కోర్టులో పెండింగ్‌లోనే ఉంది. 12 ఏళ్లు గడుస్తున్నా కేసు తేలకపోవడంతో, కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి.

హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కార్యాలయాల్లో సుమారు రూ.నాలుగు కోట్ల నుంచి రూ.ఐదు కోట్ల విలువ చేసే షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వీటిని వేలం వేసి కొత్తగా కొనుగోలు చేయాల్సి ఉంది. అలా జరగాలంటే షట్టర్ల అవినీతిపై ఉన్న సిఐడి కేసు అంశాన్ని పరిష్కరించాల్సి ఉంది. జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తే సమస్య పరిష్కారమవుతుందని ఇంజినీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

వేధిస్తున్న లష్కర్ల కొరత

సాగునీటి రంగంలో క్షేత్రస్థాయిలో కీలకమైన లష్కర్ల కొరత వేధించడం మరో సమస్యగా ఉంది. జలవనరుల శాఖలో 200 మంది లష్కర్లు, మ్యాన్ మజ్దూర్లు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 25 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 1978-80 మధ్య కాలంలో లష్కర్లు, మ్యాన్ మజ్దూర్ నియామకాలు చేపట్టారు తప్ప ఆ తర్వాత భర్తీ చేయలేదని అధికారులు చెప్తున్నారు.

ఉద్యోగ విరమణ తర్వాత చాలా పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. లష్కర్లు లేకపోవడంతో నీటిని నియంత్రించే అవకాశం లేకుండా పోయింది. కొన్నిచోట్ల ఇంజినీర్లే గేట్లు ఎత్తడం, దించడం చేస్తున్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

భూ సమస్యలు పరిష్కరించకపోతే...

26న ఏరువాక

ప్రజాశక్తి - హిరమండలం

మండలంలోని గులుమూరు పంచాయతీ పరిధి జగన్నాథపురం గిరిజనుల భూ సమస్యను పరిష్కరించకుంటే ఈనెల 26న ఏరువాక కార్యక్రమం చేపడతామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాదరావు హెచ్చరించారు. భూ సమస్య పరిష్కారం కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన గిరిజనులు రెండు నెలలుగా కొనసాగిస్తున్న ఆందోళన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు గిరిజనులతో బుధవారం చర్చలు జరిపారు. ఈనెల 24వ తేదీ నాటికి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ 40 ఏళ్లుగా గిరిజనులు భూములు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి వాటిని ఆక్రమించారని చెప్పారు. సాగు చేస్తున్న గిరిజనులకు భూ హక్కులు కల్పించాలని కోరారు. రెవెన్యూ యంత్రాంగం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, లేకుంటే గిరిజనులు అందరినీ సమీకరించి ఈనెల 26వ తేదీన ఆ భూముల్లో ఏరువాక కార్యక్రమం చేపడతామన్నారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కె.దాసు, పల్ల కృష్ణ, ప్రసాద్, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధునికీకరణ

ఎఎఐ నిధులతో అభివృద్ధి : జెసి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆధునికీకరిచేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులను అందించనుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అభివృద్ధి ప్రణాళికకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన అభ్యర్థన మేరకు ఎఎఐ ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మోడల్ గ్రంథాలయంగా జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, పాఠకులకు ఉపయోగపడే సౌకర్యాలతో ఇది స్టేట్ ఆఫ్ ఆర్ట్ గ్రంథాలయంగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిధులను జిల్లా పాలనా యంత్రాంగమే వినియోగించనుందని, ఎలాంటి ప్రైవేటీకరణ అంశం ప్రస్తావనకు రాలేదని స్పష్టం చేశారు. గ్రంథాలయం పూర్తిస్థాయిలో ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉంటుందని, ఇప్పటికే ప్రజా ఆస్తిగా ఉన్న ఈ గ్రంథాలయం భవిష్యత్‌లోనూ అలాగే కొనసాగుతుందని తెలిపారు. గ్రంథాలయం ప్రైవేటీకరణ చేస్తారనే ప్రచారాలు నమ్మొద్దని కోరారు. గ్రంథాలయ అభివృద్ధి పూర్తయిన తర్వాత విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఎంతగానో ఉపయోగపడే కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

యోగా ప్రాముఖ్యతను చాటుదాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

యోగాంధ్ర స్ఫూర్తితో యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పే అవకాశం లభించిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో బుధవారం నిర్వహించిన యోగాంధ్రలో భాగంగా యోగాసనాల ప్రక్రియ అనంతరం మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజానికి యోగా ఎంత అవసరమో ఇప్పటికే చాటిచెప్పామన్నారు. చారిత్రక ప్రదేశాల్లో యోగాంధ్రాను జిల్లా అధికారుల సహకారంతో నిర్వహించామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ యోగాంధ్రను పండగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 21న విశాఖపట్నంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అధికారులు, యోగా గురువులు, సాధకులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యోగా చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

రూ.518 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పలాస నియోజకవర్గంలో రూ.518 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. సాగు, తాగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలోని బెండి, నువ్వలరేవు, మంచినీళ్లపేటలో రూ.3.80 కోట్ల జల్ జీవన్ మిషన్ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనలో మాజీ మంత్రి అప్పలరాజు ప్రచార ఆర్భాటాలే తప్ప చేసిన అభివృద్ధి పనులు శూన్యమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రూ.518 కోట్లు నిధులు మంజూరు చేయించి, నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా పూర్తిస్థాయి పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా శుద్ధజలాలు అందించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రమేష్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, మాజీ ఎంపిపి జి.వసంతరావు, కణితి సురేష్, ఎపిటిడిసి చైర్మన్ వజ్జ బాబూరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శిరీష

ట్రాఫిక్ ఇబ్బందులు నిత్యకృత్యం

- కల్వర్టు పనులు పూర్తి కాక గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులో కొత్తరోడ్డు వద్ద ఉన్న కల్వర్టు పనులు పూర్తి కాకపోవడంతో ట్రాఫిక్ నిత్యకృత్యమైంది. నిత్యం గంటల తరబడి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతుండడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల మధ్యలో రద్దీగా ఉండే సమయంలో కల్వర్టు వద్ద ట్రాఫిక్ జామ్ కావడంతో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. కల్వర్టు దాటాలంటే రెండు గంటల సమయం పడుతుందంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. వాహనదారులు, ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనూ సకాలంలో గమ్యస్థానాలు చేరుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు రెండు వరుసల రహదారి పనులు చేపట్టినా కల్వర్టు నిర్మాణాలు జరగలేదు. దీంతో గతంలో ఉన్న కల్వర్టుపై నుంచి రాకపోకలు సాగుతున్నాయి. ఎదురెదురుగా వాహనాల రాకపోకలు సాగించడానికి కల్వర్టు అనువుగా లేదు. దీంతో ఎదురుగా వచ్చిన వాహనం కల్వర్టు దాటిన తర్వాత మరో వాహనం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. శ్రీకాకుళం నుంచి పార్వతీపురం, బత్తిలి వైపు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డుపై వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. అందులోనూ ఇసుక లారీల రాకపోకలు పెరగడంతో రద్దీ మరింత పెరిగింది. ఉదయం పాఠశాలకు వెళ్లే బస్సులు, అంబులెన్సులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు సకాలంలో వారి గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పాలవుతున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు హైవే పెట్రోలింగ్, పోలీసులు ప్రయత్నం చేస్తున్నా, వారికి శక్తికి మించిన పని అవుతోంది. కొత్త కల్వర్టు ఏడాదికి పైగా నిర్మాణ దశలోనే ఉందని, ఎప్పటికి పూర్తవుతుందో తెలీని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదాలను నివారించే బారికేడ్లు, రిఫ్లెక్టర్లు వంటివి ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు చెప్తున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కల్వర్టు పనులు పూర్తి చేసి ప్రయాణ ఇబ్బందులను తప్పించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

నిలిచిన వాహనాలు

గ్రామదేవత పండగలో అపశృతి

అంజలి రథం విరిగి ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు పైడితల్లి గ్రామదేవత పండగలో భాగంగా బుధవారం నిర్వహించిన ఊరేగింపులో అంజలి రథం విరిగి ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అంజలి రథాన్ని అమ్మవారి ఇంటి నుంచి నాయుడు వీధిలోని దేవుని ఇంటి వరకు మంగళవారం ఊరేగించాల్సి ఉంది. అప్పటికే ఆలస్యం కావడంతో బుధవారం ఉదయం ఊరేగింపు చేపట్టారు. అంజలి రథాన్ని జన సందోహం మధ్య ఊరేగిస్తుండగా ఒక్కసారిగా విరిగిపోయింది. దీంతో బండిపై ఉన్న వారు కిందపడిపోయారు. ఈ ఘటనలో పొందూరుకు చెందిన పోలాకి ఆదినారాయణ, ఎ.శేఖర్, అనకాపల్లి రామకృష్ణ, సిహెచ్.అప్పన్నకు గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన వారిని స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆదినారాయణను రాజాం జిఎంఆర్ ఆస్పత్రికి, శేఖర్‌ను విజయనగరం ఆస్పత్రికి తరలించారు.

విరిగిన అంజలి రథం

గాయపడిన ఆదినారాయణ

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తున్నట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు భవానీ శంకర్ తెలిపారు. మండలంలోని నిమ్మాడలో గల రైతుసేవా కేంద్రంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ చేతుల మీదుగా రైతులకు యంత్ర పరికరాల నిధుల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా భవానీ శంకర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.2.09 కోట్లతో 1404 మంది చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు, రోటావేటర్లు, బ్రష్ కట్టర్లు అందజేస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణతో పంట పెట్టుబడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ టెక్కలి డివిజన్ సహాయ సంచాలకులు బి.వి తిరుమలరావు, వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, మాజీ ఎంపిపి టి.రమకృష్ణ, మాజీ ఎఎంసి చైర్మన్ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న నాయకులు, అధికారులు

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, ఇచ్ఛాపురం

ఈనెల 20వ తేదీన నగరంలోని నెహ్రూ యువ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత www.ncs.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అపోలో ఫార్మశీ, డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలు హాజరు కానున్నాయని తెలిపారు. బిడిఎం, ఫార్మశీ, ఇంటర్మీడియట్, కెమిస్ట్రీ సబ్జెక్టుగా డిగ్రీ పూర్తి చేసిన వారు, పాలిటెక్నిక్ మెకానికల్ డిప్లమో పూర్తి చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

23న ఇచ్ఛాపురంలో మెగా జాబ్‌మేళా

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇచ్ఛాపురంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 23న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో 16 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. 900 ఖాళీలను భర్తీ చేయనుండగా, ఎస్-ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బి.ఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులు. అభ్యర్థులు naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హతల అసలు, జిరాక్స్ ప్రతులు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో 23న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 62818 69907, 91824 80410 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎంహెచ్ జీవితం అనుసరణీయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కీర్తిశేషులు మోటూరు హనుమంతరావు జీవితం అనుసరణీయమని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు అన్నారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో డెస్క్ ఇన్‌ఛార్జి జి.లక్ష్మణరావు అధ్యక్షతన ఎంహెచ్ 24వ వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. తొలుత ఎంహెచ్ చిత్రపటానికి సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపాదకునిగా, ఉద్యమకారునిగా, రాజకీయవేత్తగా, మేధావిగా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఎంహెచ్ నిరంతరం కృషి చేశారని చెప్పారు. ప్రజాప్రతినిధిగా, సంపాదకునిగా ఏకకాలంలో రెండింటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని చెప్పారు. ప్రజాశక్తి పత్రికకు పునాది వేసి నిలదొక్కుకునేందుకు ఎంహెచ్ చేసిన తెగువను సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజాశక్తి సంపాదక బాధ్యతల్లోనూ మోటూరు విశేష కృషి చేసి సవ్యసాచి అనిపించుకున్నారని తెలిపారు. మోటూరు ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. సభకు సమన్వయ కమిటీ సభ్యులు ఎ.సోమశేఖర్ ఆహ్వానం పలకగా, టి.బుజ్జిబాబు వందన సమర్పణ చేశారు. సభలో స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంహెచ్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ట్రాక్టర్ నడుపుతున్న విప్ అశోక్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ తెలిపారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయం నుంచి పార్టీ నాయకులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగతి నుంచి [illegible] రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.5 లక్షలతో జగతి సచివాలయం నుంచి నిర్మించిన సిసి రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసి అభివృద్ధి పనులు అటకెక్కించిందని ఎద్దేవా చేశారు. కవిటి గ్రామంలో ఒక రోడ్డు నిర్మించని పరిస్థితి కూడా లేదని అన్నారు. తిరోగమనంలో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గాడిన పెడుతున్నారని అన్నారు. సంక్షేమంపై గొప్పలు చెప్పుకున్న వైసిపి నేతలకు తల్లికి వందనం పథకం అమలుతో భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని, దీంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పంచాయతీకి మంజూరైన ట్రాక్టర్‌ను స్వయంగా నడిపించి ప్రారంభించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి మండల అధ్యక్షుడు పొందర కృష్ణారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు

తల్లికి వందనం వర్తింపజేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు వర్తింపజేయాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కార్మికులు తమ కుటుంబాలకు తల్లికి వందనం పథకం అమలు కాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సంక్షేమ పథకాలు అమలు చేయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించిందన్నారు. ముందుగా పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్ రమేష్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఏదీ 'సంపద సృష్టి'?

- హడావుడిగా నిర్మాణాలు
- శిథిలావస్థకు చేరుకున్న వైనం
- పట్టని అధికారులు, పాలకులు

నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డు నిర్మాణం నీరుగారుతోంది. ఆర్థిక స్వావలంబన సాధించాలని డంపింగ్ యార్డులో చేపట్టిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ సిబ్బందికి చిత్తశుద్ధి లేకపోవడంతో సంపద రాని పరిస్థితి నెలకొంది. పట్టణానికి సమీపంలో ఉన్న మూడు ఎకరాల్లో డంపింగ్ యార్డు రోజూ పంచాయతీ పరిధిలో 15 టన్నుల వరకు వివిధ రకాల వ్యర్థాలు సేకరించి ఇక్కడకు తరలిస్తున్నారు. అయితే చెత్త నుంచి సంపద తీసే కార్యక్రమం చేపట్టాల్సి ఉన్నా పంచాయతీ అధికారుల్లో చిత్తశుద్ధి లేక పోవడంతో సేకరించిన చెత్తను కాల్చేస్తున్నారు. ఫలితంగా సంపద రావడంలేదు. దీంతో పంచాయతీ ఆర్థిక స్వావలంబన సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. దీనికితోడు చెత్తను కాల్చడం వల్ల ఇక్కడ పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సిబ్బంది లేక టెక్కలి అనుకున్న చెత్త సేకరణ కేంద్రం ఏర్పాటు చేస్తే వర్మీకంపోస్టు యూనిట్, తడి, పొడిచెత్త వేరుచేసే కేంద్రాలు, పల్వరైజర్, వ్యర్థాల నుంచి కంపోస్టు ఎరువుల తయారీ కేంద్రాలు నిర్మించారు. అవి నిర్వహణ లేకపోవడంతో వినియోగించకుండా శిథిలావస్థకు చేరాయి. దీంతో డంపింగ్ యార్డు నిరుపయోగంగా ఉన్న తడి-పొడి చెత్త సంపద కేంద్రం యార్డులో చెత్తను కాల్చి బూడిద చేయడం తప్ప సంపద సృష్టించడం అటకెక్కిపోయింది. పట్టణంలో సేకరిస్తున్న చెత్త నుంచి ప్లాస్టిక్, కుళ్లిన వ్యర్థాలు వేరుచేసి రీసైక్లింగ్ చేయాల్సి ఉంది. అయితే అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందిని చెత్త సేకరణకు వినియోగిస్తున్నారు. డంపింగ్ యార్డులో కల్పించిన వసతులు, సౌకర్యాలు వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. కొద్దిమంది సిబ్బందిని నియమించి డంపింగ్ యార్డును అభివృద్ధి చేస్తే దీర్ఘకాలిక ఆదాయం వచ్చే అవకాశముంది. ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే మండలంలో అన్ని చెత్త సేకరణ కేంద్రం ఇలాగే ఉన్నాయి. ఉద్దానం, జలజీవన్ మిషన్ పనితీరుపైనా అసంతృప్తి డయాలసిస్ రోగులకు సదుపాయాలు కల్పించాలి.

సభ్యుల మధ్య మాటల యుద్ధం

రసాభాసగా మండల సమావేశం

వాగ్వాదం చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండల సమావేశంలో అధికారులను ప్రశ్నించే విషయమై ఎంపిటిసి మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, కేసుపురం సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెలుగు ఎపిఎం ప్రసాదరావుపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న ఎంపిటిసి చక్రవర్తిరెడ్డితో సర్పంచ్ ఢిల్లీరావుల మధ్య వాదోపవాదాలు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇద్దరూ మధ్య వాదోపవాదాలు చివరికి సమావేశంలో కేవలం ఎంపిటిసి పరిధిలో అంశాలు మాత్రమే ప్రశ్నలు అడగాలి కానీ, అన్ని ప్రాదేశికాల అంశాలపై మాట్లాడడంపై ఢిల్లీరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో సర్పంచ్‌లకు ఏమి అధికారం ఉందని అడుగుతున్నావని చక్రవర్తిరెడ్డి నిలదీశారు. ఇలా వీరిద్దరి మధ్య మాటలు యుద్ధం జరిగింది. ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్ మాట్లాడుతూ సమావేశంలో గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌కు అడిగే హక్కు ఉందని గుర్తుంచుకోవాలని అన్నారు. అంశాలు తీర్మానంలో కానీ, ఓటింగ్‌లో మాత్రం సర్పంచ్‌లకు హక్కు లేదని స్పష్టం చేశారు. ఎంపిడిఒ రామారావు కలుగజేసుకుని సమావేశంలో సర్పంచ్‌లు ప్రశ్నించవచ్చునని అన్నారు. వ్యక్తిగత దూషణలు చేయడం ఎవ్వరికీ మంచిది కాదని నచ్చచెప్పడంతో గొడవ సర్దుమణిగింది. సివిల్ సప్లయిపై జరిగిన చర్చలో కేసుపురానికి చెందిన రేషన్ లబ్ధిదారులు సన్యాసిపుట్టుక వెళ్లి డీలర్ దగ్గర సరుకులు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ఢిల్లీరావు ప్రశ్నించారు. సుమారు 64 మంది 252 యూనిట్ల రేషన్ పక్క గ్రామానికి వెళ్లడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. అదే గ్రామానికి చెందిన రేషన్ డీలర్ దగ్గర రేషన్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తీర ప్రాంత గ్రామంలో కేవలం 20 శాతం మాత్రమే అడంగల్ ఉండడం వల్ల ప్రభుత్వ అందించే పథకాలు చాలామంది లబ్ధిదారులకు అందడం లేదని ఎంపిటిసి గురుమూర్తి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తల్లికి వందనం గతేడాది వరకు వచ్చిన లబ్ధిదారులకు, ఈసారి ఎందుకు నిలుపుదల చేశారని ప్రశ్నించారు. వర్షాలు కురుస్తున్నాయని, బాహుదా గ్రోయన్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ఎంపిటిసి దక్కత ఏకాంబరిదేవి ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. మంజూరైన నిధులతో పనులు వేగవంం చేయాలని కోరారు. తేలుకుంచు పంచాయతీలో రీ సర్వే దాదాపు 90 శాతం పూర్తయిందని, మిగిలిన వాటిలో వస్తున్న తప్పులు సరిదిద్దడం లేదని సర్పంచ్ పాతర్ల రాజశేఖరరెడ్డి డిటి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంఇఒ అప్పారావు, ఎఒ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి

రణస్థలం: ఎపిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల గురువారం జిల్లాలో పర్యటించనున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని ఎచ్చెర్ల కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆబోతుల వెంకటనాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షర్మిల ఎచ్చెర్ల నియోజకవర్గం మీదుగా శ్రీకాకుళంలో ఇందిర విజ్ఞాన్ భవన్‌కు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకోనున్నారని తెలిపారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల ప్రజలు, కార్యకర్తలు, నాయకులతో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రజలు, కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొవాలని కోరారు.

స్టీల్ ప్లేట్లు వితరణ

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి తల్లిదండ్రులు స్టీల్ ప్లేట్లు బుధవారం వితరణ చేశారు. మండలంలోని కంబకాయకు చెందిన చిరినెల్లి వెంకటరమణ తమ కుమారుడు చిరినెల్లి వంశీ ఇదే కళాశాలలో హెచ్ఇసి చదివి అత్యుత్తమ మార్కులు సాధించాడు. పేద విద్యార్థులకు సహాయం అందించేందుకు ఈ వితరణ కార్యక్రమం చేశామన్నారు. చరిత్ర సబ్జెక్టులో వందకు 95 మార్కులు రావడంపై అధ్యాపకులు రుంకు సోమశేఖర్‌కు అభినందనలు తెలిపారు. చిరినెల్లి వంశీ ఆర్ట్స్ గ్రూపులో 76 శాతం మార్కులు సాధించడంపై ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లైబ్రరీ అధ్యాపకులు వదనగిరి, మల్లేషు, శాంతారావు, రాంప్రసాద్, రవి పాల్గొన్నారు.

ప్లేట్లు అందజేస్తున్న వెంకటరమణ

శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే శంకర్ జన్మదినం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ జన్మదిన వేడుకలను బుధవారం టిడిపి నాయకులు నిర్వహించారు. నగర బిసి సెల్ అధ్యక్షుడు ఉంగటి రమణమూర్తి ఆధ్వర్యాన గొలివి దామోదర్, ప్రియా చిట్టిబాబు దాస్యం నాని, గంగు పెద్ద రమణ, ఉంగటి పాపారావులు నగరంలోని అనాథ శరణాలయాల్లో ఈ వేడుకలను నిర్వహించారు. టిడిపి నగర అధ్యక్షుడు మాధవరపు వెంకటేష్, అంబటి లక్ష్మీరాజ్యం, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు జగన్మోహనరావు కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలకు అన్నదానం చేశారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రమణమూర్తి రూపొందించిన పాంప్లెట్స్‌ను శంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలుగు నాగరత్నం, ఉంగటి రామ్మోహన్, రాయిపిల్లి అర్జున్, దండాసి జ్యోతిభాస్కర్, వ్యాపార శ్రీనివాస్, పి.కవిత, గొలివి భాస్కర్, సిమ్మ ప్రకాష్, వి.పెద్దరమణమూర్తి, మురళి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎంఇఒ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

టెక్కలి : బదిలీలపై మండలాలు మారిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంఇఒ దాసుపురం చిన్నారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఎల్‌పిసిఎస్‌ఆర్‌లు, ఇఎల్స్ మంజూరు తదితర సమస్యలపై వారి ఎస్ఆర్‌ను తక్షణమే పూర్తి చేసి మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎంఇఒ స్పందిస్తూ పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు పి.గణపతిరావు, టి.వైకుంఠరావు, జిల్లా సహాధ్యక్షులు కురమన దాలయ్య, మారం కుమారస్వామి, డొంకాన పాపారావు, దాసుపురం చిన్నారావు, విజయకుమార్ పాల్గొన్నారు.

నియామక పత్రం అందుకుంటున్న మురళీధర్ యాదవ్

బిసి సంక్షేమ సంఘం యువజన
రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'నాగళ్ల'

ప్రజాశక్తి- ఆమదాలవలస

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన టిడిపి యువ నాయకుడు నాగళ్ల మురళీధర్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం తెలంగాణాలోని హైదరాబాద్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. జిల్లా టిడిపి బిసి, యాదవ సంఘ కార్యదర్శిగా ప్రస్తుతం పదవులో కొనసాగుతున్నారు. మురళీధర్ యాదవ్ మున్సిపాలిటీలోని తొమ్మిది పది పదకొండు వార్డుల్లో టిడిపి వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషించినందుకు ఇటీవల ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్యకు, ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాగళ్ల నియామకంపై మున్సిపల్ మాజీ చైర్‌పరసన్ తమ్మినేని గీతావిద్యాసాగర్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, మాలిక్, లంక నాగరాజు, చౌదాల గోవిందరావు మెట్టక్కివలస యువత అభినందనలు తెలిపారు.

కోర్టు భవనం మంజూరుకు వినతి

పలాస : పలాసకు కోర్టు భవనం, షాదిఖానా మంజూరు చేయాలని మైనారిటీ వెల్ఫేర్ మంత్రి ఎండి షారుక్ ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. పలాస కోర్టు గత కొన్నేళ్ల నుంచి అద్దె భవనాల్లో ఇరుకు గదుల మధ్య నడుస్తుందని అన్నారు. ఇరుకు గదులతో న్యాయమూర్తి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పలాస పాత కోర్టు ప్రాంతం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలిగించామని తెలిపారు. అయితే కోర్టుకు సంబంధించి పాత కోర్టు స్థలం సిద్ధంగా ఉందని, కోర్టు భవనాలు మంజూరుకు నిధులు కేటాయిస్తే నిర్మించుకుంటామని వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

శ్రీకాకుళం : ఈ నెల 20న పిఎన్ కాలనీ సెక్షన్ పరిధిలో 11 కెవి గుజరాతీపేట ఫీడర్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్లు తొలగింపు కారణంగా గుజరాతిపేట, హయతినగరం, సత్య నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరారం ఉంటుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

శ్రీకాంత్ పరామర్శ

మెళియాపుట్టి : మండలంలోని పెద్దపద్మాపురంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ బుధవారం పర్యటించారు. గ్రామానికి చెందిన జిల్లా విశ్రాంత జడ్జి ఎన్ని ఢిల్లేశ్వరరావు భార్య సద్గుణమ్మ ఇటీవల మృతి చెందడంతో పరామర్శించారు. అలాగే ఇసై సావిత్రమ్మ మృతి చెందడంతో వాళ్ల కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, ఎంపిటిసి ఊర్లాన రుషి, సర్పంచ్ మడపాల సంజీవరావు, మాజీ సర్పంచ్ సంజీవరావు, ఎన్ని లక్ష్మీనారాయణ, సలాణ సత్యం, ఢిల్లేశ్వరరావు, వెంకటరావు, నాగరాజు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఎలు

ప్రజాశక్తి- పలాస

గ్రామ రెవెన్యూ సహాయకులకు తక్షణమే కనీస వేతనం అమలు చేయాలని విఆర్ఎ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న విఆర్ఎలకు విఆర్ఒగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్ఎలుగా నియమించాలని కోరారు. అటెండర్, నైట్ వాచ్‌మెన్ ఉద్యోగోన్నతి కోటాను 20 నుంచి 70 శాతానికి పెంచాలన్నారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి విఆర్ఎ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో విఆర్ఎ సంఘం అధ్యక్షుడు సిహెచ్.లక్ష్మణరావు, కార్యదర్శి బి.తిరుపతిరావు, సిహెచ్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

టిడిపి పట్టణ అధ్యక్షునిగా తవిటయ్య

తవిటయ్య

కోటేశ్వరరావు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ నూతన కార్యవర్గంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో తొలిసారిగా ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ క్యాంపు కార్యాలయంలో పట్టణ టిడిపి నాయకులతో బుధవారం ఓటింగ్ నిర్వహించారు. పట్టణ అధ్యక్షుని పదవి కోసం పోటీ పడుతున్నా... ఇద్దరు నాయకులు మద్దతు దారులు సమీకరించి ప్రయత్నం చేశారు. చివరికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు మొదలవలస రమేష్ సమక్షంలో పట్టణ టిడిపి నాయకులతో ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్‌లో అత్యధికంగా కేడర్ మూడో వార్డు టిడిపి కౌన్సిలర్ పత్రీ తవిటయ్యను పట్టణ అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా నందిగాం కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ పదవి కోసం మొదటి సారిగా తీవ్ర పోటీ ఏర్పడింది. దశాబ్దాలుగా పట్టణ అధ్యక్షుని బాధ్యతలు నిర్వహిస్తున్న కాళ్ల ధర్మారావును పార్టీ నిర్ణయం మేరకు తొలగించే పరిస్థితి వచ్చింది. దీంతో ఈ పదవికి అప్పటి వరకు ఎన్నో ఆశలు పెట్టుకున్న నందికి జాని ఆశలు అడియాశలయ్యాయి. ఇచ్ఛాపురం పట్టణ అధ్యక్షుని పదవి యాదవులకు కేటాయించారు. విప్ చెప్పడంతో యాదవుల నుంచి కొత్తగా తవిటయ్య బరిలో రావడం, పార్టీ కోసం దశాబ్దాలుగా సేవలు అందించే తమ కుటుంబ నుంచి తన తనయుడు కాళ్ల జయదేవ్‌కు కావాలని పోటీ పడ్డారు. దీంతో ఎటూ తెలుచుకోలేని విప్ ఓటింగ్ ద్వారా నూతన కార్యవర్గం ఎన్నుకోవాల్సి వచ్చింది. మొత్తం మీద కొత్త కార్యవర్గంతో మున్సిపాలిటీలో పార్టీ మరింత బల పడేందుకు దోహదపడాలని విప్ సూచించారు.

విద్యుత్‌శాఖ తీరుపై గరంగరం

జలజీవన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

విధుల్లో చేరి ఆరు నెలలు గడిచినా మండలంలో ఏం జరుగుతుందో తెలియకపోవడం సిగ్గుచేటని, భవిష్యత్‌లో ఇదే విధంగా ఉంటే పనికిరాదని విద్యుత్ శాఖ ఎఇ యు.శ్రీనివాసరావుపై జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ పనితీరుపై జరిగిన చర్చలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా విద్యుత్‌శాఖ పనితీరు సక్రమంగా లేదని కనీసం సదరు సిబ్బంది ఫోన్ కాల్‌కు కూడా స్పందించడం లేదని మెజారిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకూ ఎఇ సమాధానం ఇవ్వలేకపోవడమే కాక కొన్ని కొన్ని గ్రామాలు మండలంలో ఎక్కడున్నాయో కూడా ఇప్పటికీ అతనికి తెలియకపోవడం విశేషం. వ్యవసాయ శాఖ పనితీరుపై వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎంపిటిసి దుద్ది సతీష్‌తో పాటు పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు కనీసం సమాచారం ఇవ్వకుండానే విత్తనాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించారని ఆరోపించారు.

దీనికి మిగతా సభ్యులు కూడా జతకలిపారు. వైద్యశాఖ సమీక్షలో డయాలసిస్ రోగులకు గతంలో వాహన సదుపాయం ఉండేదని ఇప్పుడు అది తీసివేయడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్దానం జలజీవన్ మిషన్ పనులు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని, జలజీవన్ మిషన్ పనులు స్థానిక పంచాయతీలకు అప్పగిస్తే మరింత వేగవంతమై ప్రజలకు మెరుగైన నీరు అందించేందుకు అవకాశం ఉంటుందని సర్పంచ్‌లు బెందాళం శ్రీరామ్ ప్రసాద్, బద్రి ప్రకాష్, ఎంపిటిసి పూడి నీలాచలం అన్నారు. బదిలీల్లో భాగంగా మండలంలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు బోధించడం కష్టంగా ఉందని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. ఉద్దానంలో విరివిగా పండే జీడి పంటకు మద్దతు ధర కల్పించేలా తీర్మానం చేసి జీడి రైతులకు అండగా నిలవాలని ఎంపిటిసి పూర్ణచంద్రరావు కోరారు. అనంతరం ఎమ్మెల్సీ నర్తు రామారావు ఉద్యోగులు వారి విధి నిర్వహణ సక్రమంగా చేసి ప్రజాసంక్షేమానికి కృషి చేయాలని హితవుపలికారు. ఈ సమావేశానికి సగానికి పైగా శాఖలు గైర్హాజర్ కావడం గమనార్హం. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ కృష్ణమూర్తి, మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతంపై దృష్టి

బూర్జ: ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించ నున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాంధ్రలో ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు పాల్గొంటున్నారని, మండల స్థాయిలో ప్రజల భాగస్వామ్యం పెంపొందించేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. యోగా పరిశీలకులు, పాడేరు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వప్రసాదం, టిడిపి మండల అధ్యక్షులు వి.సీతారాం బాబునాయుడు, ఎంపిటిసి పోలినాయుడు, ఎన్ఆర్ఐ మానవ హక్కు ల కమిషనర్ సభ్యులు వ్యాపారి వెంకటేష్, సర్పంచ్‌లు గణపతిరావు, కె.వెంకట సీతారామ రాజు, ఎంపిడిఒ తిరుపతిరావు, తహశీల్దార్ వై.వి.పద్మా వతి, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతంపై మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు రవికుమార్, కృష్ణప్రసాద్‌లు అధికారులతో సమీక్షించారు.

ఆమదాలవలస : మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతంపై మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో యోగా ప్రత్యేక అధికారి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, టిడిపి బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి బొర గోవిందరావు, ఎన్‌టిఆర్ మెడికల్ ఇన్స్టిట్యూట్ కౌన్సిల్ మెంబర్ చాపర సుధాకర్ పాల్గొన్నారు.

టెక్కలి : అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లుక్‌పాల్, వాసు బాబు, పివిఎన్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కుమార్ పట్నాయక్ పర్యవేక్షణలో యోగాంధ్ర విజయవంతంపై మండల ప్రత్యేకాధికారి గోపిబాల సమీక్షించారు.

మహిళకు గాయాలు

పలాస : పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపం విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద బుధవారం సంభవించిన ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. సోంపేట మండలం గొల్లకంచిలికి చెందిన ఎస్.ఆదెమ్మ పనస పండ్లు అమ్ముకుని రోడ్డు దాటుతుంది. అదే సమయంలో పలాస నుంచి కాశీబుగ్గ వైపు ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. వెంటనే క్షతగాత్రురాలను పలాస ప్రభుతాస్పత్రికి స్థానికులు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్‌చేశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ఆదెమ్మ

పారిశుద్ధ్య పనులపై స్పందించరా?

నిలదీసిన సభ్యులు

ఇఒపిఆర్‌డిని ప్రశ్నిస్తున్న సర్పంచ్ హేమసుందరరాజు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు రోగాల బారిన పడకుండా గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఇఒపిఆర్‌డి జె.ఆనందరావు అన్నారు. దీనిపై స్పందించిన సభ్యులు తాము గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి సిద్ధంగానే ఉన్నామని, కానీ, అధికారులే ముందుకు రావడం లేదని ఆయనకు గట్టిగా బదులించారు. మండల పరిషత్ సమావేశంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసి రెండు నెలలు కావస్తున్నా... ఇప్పటి వరకు పంచాయతీ ఖాతాల్లో డబ్బులు జమకాలేదని సభ్యులు ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని మహదేవపురం పాఠశాలలో ఒక్క విద్యార్థి లేకపోవడంతో ఆ పాఠశాల ఎత్తివేసేందుకు సిద్ధంగా ఉందని, ప్రజాప్రతినిధులు స్పందించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజా, రామకృష్ణ, బోయిన నాగేశ్వరరావు, సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు, కాళ్ల సంజీవరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొందూరులో స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో పొందూరు పైడితల్లి గ్రామదేవత పండగ సందర్భంగా బుధవారం తరలివచ్చిన ప్రజలు, బంధువులు, స్నేహితులు, ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. మండలంలో 16 ఏళ్ల తరువాత పొందూరు, లక్ష్మీపేట, జోగెన్నపేట, ఎరుకులపేట, అలబోయినపేట, ఎరుకుల కాలనీ, తాపీమేస్త్రి కాలనీ, కృష్ణాపురం గ్రామాల్లో గ్రామదేవత పండగను నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచే పండగకు వాహనాలుతో ప్రజలు తరలిరావడంతో రద్దీ నెలకొంది. దీంతో పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలను గ్రామాల్లోకి అనుమతించలేదు. చిలకపాలెం-రాజాం అంతర్రాష్ట్ర రహదారిలో పండగకు వచ్చిన వాహనదారులతో పాటు కార్లు, లారీలు, ఆర్‌టిసి బస్సులు రాకపోకలు సాగించడంతో ఒక్కసారిగా ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. జి.సిగడాం మండలం వాండ్రంగా వద్ద రైల్వే వంతెన నుంచి సుమారు రెడ్డిపేట వరకూ గల సుమారు ఐదు కిలోమీటర్లు మేరకు వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ కారణంగా పాలకొండ, విశాఖపట్నం, రాజాం, బొబ్బిలి, సాలూరు ప్రాంతాలకు వెళ్లే ఆర్‌టిసి బస్సులు నిలిచపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి.సత్యనారాయణలు సిబ్బందితో ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు సుమారు సాయంత్రం 4 గంటలైంది.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108

పొందూరు వద్ద సుమారు గంటన్నర పాటు 108 వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుంది. రాజాం ప్రభుత్వాస్పత్రి నుంచి పాముకాటు బాధితుడిని అత్యవసర చికిత్సకు 108 వాహనంతో శ్రీకాకుళం తరలించారు. ఈ వాహనం ఒక్కసారిగా ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో బాధితుడితో పాటు కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళన చెందారు. ట్రాఫిక్ నుంచి 108 వాహనాన్ని బయటకు తరలించేందుకు పోలీసులతో పాటు, స్థానికులు ఎంతగానో శ్రమించారు.